క్లుప్తంగా

పేదల సొంతింటి కల సాకారం



శ్రీరామవరంలో నూతన గృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శ్రీరామవరంలో జగనన్న కాలనీలో సోమవారం నవరత్నాల పథకాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో మేకల వెంకన్న కుమారుడు మేకల అజయ్ నిర్మించిన నూతన గృహాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభోత్సవం చేశారు. ఇంటి యజమానులు అజయ్‌కు ఎమ్మెల్యే నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు, శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి నాని, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాస్, రమేష్ తదితరులు ఉన్నారు.

రామాలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు



ఉంగుటూరులో రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ఉంగుటూరు: ఉంగుటూరులో కమ్మవారి రామాలయంలో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రామాలయాన్ని పునర్నిర్మించి విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. మంగళవారం విశేష పూజలు నిర్వహించి, బుధవారం ప్రతిష్ఠ మహోత్సవం, కల్యాణం నిర్వహిస్తారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో పూజలు నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెదపాడు : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు టోల్ గేట్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చట్టం ప్రకారం నిబంధనలు పాటించని వారికి అవగాహన కల్పించారు. వాహనాలు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. దీనివల్ల ప్రమాదాలు నివారణ చేయవచ్చునన్నారు. ఈకార్యక్రమంలో హెల్మెట్ ధరించని వారికి అపరాధ రుసుము విధించామన్నారు.

చిరస్మరణీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: చరిత్ర ఉన్నంతకాలం భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్పతనం చిరస్మరణీయంగా నిలిచి ఉంటుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం రాత్రి ముప్పవరం పంచాయతీలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనాన్ని సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షతన ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేద, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధికి ఎనలేని సేవ, కృషి చేశారన్నారు. అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించడంపై సర్పంచ్ సంతోష్‌కుమార్, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ అప్పనప్రసాద్, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీతో ఆదాయం

పెదవేగి : ఉపాధి హామీ పథకం పేదల పాలిట చక్కటి ఆదాయ మార్గంగా మారుతుందని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. పెదవేగి మండలం అమ్మపాలెంలో సోమ వారం ఉపాధి పని ప్రాంతాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. ఈ మేరకు వారితో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలు అధిక సంఖ్యలో వస్తున్నప్పటికీ పని ముట్లు సరైన రీతిలో ఉపయోగించకపోవడం వల్ల ఉపాధి హామీ పథకంలో రోజువారి తక్కువ వస్తోందని చెప్పారు. అధిక వేతనం రూ.257 పొందేందుకు కూలీలు సగం మంది పలుగు, పారలు ఉపయోగించి, కొలతల ప్రకారం పనిచేయాలన్నారు. ప్రతి గ్రూపు సభ్యులు అంతర్గత కట్టడితో పనిముట్లతో ఎక్కువ పని గంటలు పనిచేస్తే అధిక వేతనం వచ్చే అవకాశం ఉంటుందని ఎంపీడీవో కూలీలకు వివరించారు.

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యం

గణపవరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, మనం ఇప్పుడు కళ్లు తెరవకుంటే భావి తరాల బతుకులు దుర్భరంగా మారతాయని పలువురు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యావరణపరిరక్షణపై పలు కార్యక్రమాలను నిర్వహించారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. పిప్పర పీహెచ్‌సీలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకుడు కాకర శ్యాంసన్, నాయకులు ఐవీ రాజు, వైద్యాధికారులు ప్రియాంక, దివ్య, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, పీహెచ్‌ఎన్ అన్నాకుమారి తదితరులు పీహెచ్‌సీలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలి, పర్యావరణ హితమైన వస్తువులు వాడతామని ప్రతిజ్ఞ చేశారు. గణపవరం పీహెచ్‌సీలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు సంతోష్, కిరణ్మయి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది మొక్కలు నాటారు.



పిప్పర పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటుతున్న వైద్యసిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం

పెదవేగి : పర్యావరణాన్ని పరిరక్షించుకున్న నాడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్, తహసీల్దార్ ఎన్ నాగరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పెదవేగి మండల కేంద్రంలో మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది, స్థానిక పంచాయతీ కార్యాలయం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజ్‌మనోజ్, తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. గ్రామంలో పారిశుధ్యాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి కేవీ జాన్సన్, పెదవేగి పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శి కె వరప్రసాద్, మహిళా సంరక్షణాధికారి కె జ్యోతి పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిజ్ఞ చేస్తున్న మండల అధికారులు, అటవీశాఖ అధికారులు

తహసీల్దార్ కార్యాలయంలో....

పెదవేగి మండలం తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవెన్యూ సిబ్బంది ఫారెస్ట్ సిబ్బంది, మండల ఎంపీడీవో ఆధ్వర్యంలో మేరీ లైఫ్ స్టైల్ ప్రోగ్రాంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పర్యావరణాన్ని కాపాడాలని సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్‌ను ఉపయోగించడం తగ్గించాలని విరివిగా మొక్కలు పెంచాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండల తహసీల్దార్ ఎం నాగరాజు ఎంపీడీవో జి రాజ్ మనోజ్, ఏలూరు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.వి. రామలింగ చార్యులు స్థానిక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎండీ మహబూబ్, సిబ్బంది పాల్గొన్నారు.



గోపన్నపాలెంలో వ్యాయామ కళాశాలలో మొక్క నాటుతున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్

కవ్వగుంటలో ఆఫ్రో, మాండలీజ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కవ్వగుంట, రాయ్యన్నపాలెం, కొండలరావుపాలెంలో మొక్కలు నాటారు. సర్పంచ్ మద్దాల వాణి, సచివాలయ సెక్రటరీ హేమంత్ కుమార్, మాండలీజ్ కంపెనీ రవీంద్ర, సీహెచ్ బాబు, ఆయన్నబాబు, ఆఫ్రో సంస్థ డి.యం సురేష్, పి.సి నాగరాజు, గ్రామ కోకో రైతులు, కమ్యూనిటీ లీడర్స్, హెల్త్ వర్కర్స్ పాల్గొన్నారు,

వ్యాయామ కళాశాలలో..

జు పర్యావరణాన్ని మనం రక్షిస్తే ఆ పర్యావరణం మనందరినీ కాపాడుతుందని విద్యార్థులందరూ విధిగా మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్ అన్నారు. సోమవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఫిజికల్ డైరెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 25 రకాల పండ్ల మొక్కలను కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఎంట్రన్స్ గేటు సమీపంలో ప్రిన్సిపల్, విద్యార్థులు నాటారు. పర్యావరణ పరిరక్షణ, ఆవశ్యకతపై రమేష్ వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విజయలక్ష్మి తదితరులున్నారు.

కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలి



మానవహారం నిర్వహించిన విద్యార్థులు

భీమడోలు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమడోలు శ్రీవేంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ వంగా నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఆర్.ధనరాజు, జి.నాగరాజు, కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

ఉంగుటూరు: కాలుష్యాన్ని నియంత్రిద్దాం–ధరిత్రిని కాపాడుకుందాం నినాదంతో శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నారాయణపురంలో అవవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలో వివరించారు. కళాశాల ప్రాంగణంలో మెక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గుమ్మడి నిర్మల జ్యోతి, అధ్యాపకులు బీవీ రాజు, డా. పి. బాబూరావు, కె. ఉమాశంకర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

భీమడోలు: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర స్థాయిలో సమర్థవంతంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న భీమడోలు, దుద్దేపూడి గ్రామ పంచాయతీలను కేంద్ర బృందం ఈనెల 6వ తేదీ మంగళవారం పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జే.వెంకట మురళి ఆ గ్రామాలను సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం పర్యటించనున్నట్టు తెలిపారు. సన్నాహక చర్యల్లో భాగంగా నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి ఆయన భీమడోలు, దుద్దేపూడిలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను వారు పరిశీలించారు. తొలుత భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద సంబంధిత తాగునీరు, పారిశుధ్య నిర్వహణ ఉన్నతాధికారులతో పలు అంశాలపై సమీక్షించి వారికి దిశానిర్దేశకం చేసారు. భీమడోలు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు, వెల్ నెస్ కేంద్రాలను పరిశీలించారు. ప్రజల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరు చేయడం, వాటి తద్వారా వర్మీ కంపోస్ట్ తయారీ, ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసే యంత్రాల పని తీరును వారు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీ సీఈవో కేవీఎస్ఆర్ రవికుమార్ వారికి వివరాలు తెలిపారు.వెల్‌నెస్ కేంద్రాలు, ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తారని తెలిపారు. తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలిస్తారని ఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్య నిర్వాహక డైరెక్టర్ ఊర్మిళా దేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ శిరీషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తడి చెత్త, పొడి చెత్త సేకరించే విధానాన్ని పరిశీలిస్తున్న ఎండీ జే.వెంకట మురళి, ఉన్నతాధికారులు

భీమడోలు తహసీల్దార్‌గా ఇందిరాగాంధీ

భీమడోలు: భీమడోలు తహసీల్దార్‌గా ఎం.ఇందిరా గాంధీ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ సూపరింటెంటెంట్‌గా పని చేస్తున్న ఇందిరాగాంధీ సాధారణ బదిలీల్లో భీమడోలు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన షేక్ షంషుద్దీన్ నూతన తహసీల్దార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈమె గతంలో పెదపాడు, పెదవేగి మండలాల తహసీల్దార్‌గా, ఆర్‌డీవో కార్యాయంలో ఏవోగా పని చేసారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో సమన్వయ పర్చుకుని ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ మాధవరావు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కె.శంకర్, వీఆర్వో వెజ్జు వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



భీమడోలు తహసీల్దార్ ఇందిరాగాంధీకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలుపుతున్న వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు

కేసుల పరిష్కారంలో అలసత్వం వద్దు

భీమడోలు: కేసుల పరిష్కారంలో అలసత్వం లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఏలూరు డీఎస్పీ బి.శ్రీనివాసులు అన్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. రికార్డులను ఆయన పరిశీలించారు. పలు పెండింగ్ కే సుల దర్యాప్తుపై ఎస్సై చావా సురేష్‌కుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, వృద్ధులపై జరుగుతున్న హింసకు సంబంధించిన కేసుల్లో అలసత్వం వహించవద్దని, అలసత్వం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జూదాలు అరికట్టడంతో పాటు ఆస్తి నేరాలకు పాల్పడే నిందితులను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. పెండింగ్ కేసుల్లో పురోగతిని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు, చిత్రంలో ఎస్సై చావా సురేష్‌కుమార్

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

దెందులూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అడుగుజాడల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ముప్పవరం పంచాయతీలో సర్పంచ్ మెండెం సంతోష్‌కుమార్ అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇళ్ల స్థలాలు, రుణాలు, డ్రైనేజీ, ఉపాధి, రవాణా, ఇతర అంశాలను ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలను నమోదు చేసుకుని పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖల ఉద్యోగులకు ఆయన ఆదేశాలిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), ముకుంద, కుటుంబరావు, వార్డుమెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. ముప్పవరం పంచాయతీకి విచ్చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి సర్పంచ్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.



ముప్పవరంలో పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

18న తాడేపల్లిగూడెం ఆర్యవైశ్యుల సమ్మేళనం

ఉంగుటూరు: ఈనెల 18న తాడేపల్లిగూడెంలో ఆర్యవైశ్యుల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్యుల మహాసమ్మేళనం నిర్వహించేందుకు ఆ సంఘం సభ్యులు నిర్ణయించారు. సోమవారం కైకరంలో ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు కోనాశ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జనాభా ప్రాతిపదికన ఆర్యవైశ్యులకు ఆయా పార్టీల్లో రాజకీయ హోదా కల్పించాలని తీర్మానించారు. బెల్లం విక్రయంలో ఎక్సైజు చట్టం రద్దు చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిల్లి సత్యనారాయణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి నుదురుపాటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కోనా హనుమ, వాసవీ సేవా దళ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో కాలుష్యం

భీమడోలు: ప్లాస్టిక్ వాడకాన్ని రూపుమాపేందుకు విద్యార్థి దశ నుంచే కంకణ బద్ధులు కావాలని భీమడోలు డైమండ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో 29వ రోజైన సోమవారం వేసవి విజ్ఞాన తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై బాల బాలికలకు అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పూళ్లలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులకు యోగా, భగవద్గీత శ్లోకాలను పఠించేలా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు మండే సుధాకర్, గేదెల ఈశ్వరమ్మ, పెద్దలు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరదరాజపురం సర్పంచ్ కోడేటి ఆకస్మిక మృతి

గణపవరం: గణపవరం మండలం వరదరాజపురం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడేటి నర్సింహమూర్తి(40) సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా ఆయన ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గుంటూరు వెళ్లి నర్సింహమూర్తిని పరామర్శించారు. ఆరోగ్యం విషమించడంతో సోమవారం ఉదయం నర్సింహమూర్తి మృతి చెందారు. సర్పంచ్ మృతదేహాన్ని సోమవారం వరదరాజపురంలోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే వాసుబాబు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి బాబులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నివాళులర్పించారు. సర్పంచ్ మృతికి సంతాప సూచకంగా సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రద్దుచేసినట్లు ఎమ్మెల్యే వాసుబాబు ప్రకటించారు.



సర్పంచ్ కోడేటి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు (అంతరచిత్రం) కోడేటి నర్సింహమూర్తి

పుట్టినరోజునే విషాదం: జూన్ 5వ తేదీన పుట్టిన రోజు సందర్భంగా సర్పంచ్ కోడేటి నర్సింహమూర్తి ఏటా పేదలకు, వృద్ధులకు పండ్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేస్తారు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన పుట్టిన రోజైన జూన్ 5వ తేదీనే కన్నుమూయడం ఆయన కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్రంగా కలచి వేసింది.

ఏఎంసీ వైస్‌చైర్మన్ సుధాకర్‌కు ఎమ్మెల్సీ అభినందనలు

దెందులూరు: దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా నియమితులైన కాటి సుధాకర్‌ను సోమవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్రబాబు అభినందించారు. కొవ్వలిలో ఎమ్మెల్సీ ఆయన నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని, వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు మరిన్ని సేవలందించాలని సూచించారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, నాయకులు బూసి ఎఫ్రయేమ్, గొరిపర్తి రంగారావు తదితరులున్నారు.

నేడు న్యూ క్రియేషన్ ఫెలోషిప్ కృతజ్ఞత కూడికలు

దెందులూరు: కొవ్వలిలో న్యూ క్రియేషన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐదవ వార్షికోత్సవ కృతజ్ఞత కూడికలు నిర్వహించనున్నట్లు పాస్టర్ డీకే డానియేల్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే కృతజ్ఞత కూడికల్లో పాస్టర్లు సీహెచ్ ఎ. విలియం, డీ.రత్న ప్రసాద్ వాక్య పరిచయం చేస్తారని తెలిపారు. గ్రామస్తులు ఈ కూడికలలో పాల్గొనాలని కోరారు.

అతిసార నియంత్రణకు సమష్టి కృషి

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, వైద్య సిబ్బంది, సలహాలు, సూచనలు పాటించాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రోజ్‌మేరీ అన్నారు. సోమవారం గోపన్నపాలెం పీహెచ్‌సీలో వైద్య శాఖ ఆధ్వర్యంలో అతిసార నియంత్రణ పక్షోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. గ్రామాలు, శివారు ప్రాంతాల్లో అతిసారపై వైద్యసిబ్బంది మరింత అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలను ఇంటింటా పంపిణీ చేయాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ నాగరాజు మాట్లాడుతూ 5 నుంచి 17వ తేదీ వరకు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు.



గోపన్నపాలెం పీహెచ్‌సీలో అతిసార నియంత్రణ పక్షోత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్యాధికారిణి రోజ్‌మేరీ

అతిసారపై ఇంటింటా సర్వే చేయాలి

గణపవరం: అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి అతిసార వ్యాధి లక్షణాలున్న పిల్లలను గుర్తించి, వారికి తగిన చికిత్స అందించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. సోమవారం గణపవరం పీహెచ్‌సీలో అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాల సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సరిపల్లెలో అతిసార వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అతిసార లక్షణాలున్న పిల్లలకు ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలను వైద్యనిపుణులు సూచించారని, అందువల్ల విరేచనాలు అయ్యే పిల్లలకు తప్పనిసరిగా ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ఇవ్వాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు అతిసార వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించాలని, ఇంటింటా సర్వేచేసి అతిసార లక్షణాలున్న ఐదేళ్లలోపు పిల్లలను గుర్తించాలని డా.సంతోష్ సూచించారు. పిల్లలకు అతిసార లక్షణాలు కనిపిస్తే వారికి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. వీటి వాడకం వల్ల పిల్లలు నీరస పడిపోకుండా, వారు కోల్పోయిన శక్తిని, బలాన్ని యథాస్థితికి తీసుకురావచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.